# బొమ్మ-బొరుసు

– డి.శ్రీనివాసరావు

సిటీబస్ కోసం అసహనంగా నిరీక్షిస్తుంది మధురిమ. ఎదురుగా స్కూటర్‌పై వస్తున్న జంటపై ఆమె దృష్టిపడింది. ఇద్దరూ దగ్గరయ్యారు.

''హాయ్... మధూ..''

పలుకరించిన వ్యక్తి తన స్నేహితురాలైన ఊర్మిళ అని గుర్తించడానికి ఎంతోసేపు పట్టలేదు. ''ఏంటి ఇక్కడున్నావ్? ఎలా ఉన్నావ్?'' అంటూ ప్రశ్నలు వేయసాగింది. ఆ.. అన్నట్లు మర్చిపోయాను... ఈయన మావారు... పేరు ఉదయ్. నీకు తెలిసేవుంటుంది. మనం కాలేజీ చదువుతున్న రోజుల్లో మనకు సీనియర్. అభ్యుదయ రచయితగా కూడా పేరు పడ్డారు.''

పరిచయ కార్యక్రమాలైన తర్వాత, ''దగ్గర్లో కొంచెం పనిచూసుకొస్తాను. మీరు మాట్లాడుతూండండి'' అంటూ స్కూటర్ స్టార్ట్ చేశాడు ఉదయ్.

''ఏంటే మధురిమా... మాకు ఇక్కడకి బదిలీ కావడం, నీవు ఇక్కడ కలవడం.. చాలా ఆనందంగా ఉందే.''

మాటల మధ్యలో మధురిమ కలుగజేసుకొని ''ఏంటి ఊర్మిళా.. నీ మ్యారేజ్‌కి మమ్మల్ని పిలువలేదు. నా ఎడ్రస్ తెలీదా, లేక లవ్ మ్యారేజా?''

''ఆ... అటువంటిదే అయినా, పెద్దలు కుదిర్చిందే.''

ఊర్మిళ మాటలు అర్థంకాక ''కట్నకానుకలు ఏమైనా ఉన్నాయా'' అని ప్రశ్నించింది మధురిమ.

''ఆ.. అవి కొంత మామూలే'' అని మాటలు నమిలింది ఊర్మిళ.

ఆ మాటలు విన్న మధురిమకు వంటిపై తేళ్ళు ప్రాకినట్లయింది. కోపాన్ని అదుపు చేసుకుంది. ఇంతలో ఉదయ్ వచ్చాడు. మరేం మాట్లాడలేదు ఇద్దరూ.

''మధురిమగారూ... రేపు ఎలాగూ ఆదివారం కదా? మీవారితో మా ఇంటికి రండి'' అంటూ విజిటింగ్ కార్డు ఇచ్చాడు ఉదయ్.

ఊర్మిళ స్కూటరెక్కి కూర్చుంది. ''వస్తాం'' అంది.

ఇద్దరినీ కనుమరుగయ్యేవరకూ కోపంగా చూసింది మధురిమ. కొద్దిసేపట్లో సిటిబస్ రావడంతో కష్టంమీద ఇంటికి చేరింది.

''ఈ మగాళ్ళంతా ఇంతే... పెళ్ళికి ముందు ఒకలాగ... తర్వాత మరోలాగ'' అంటూ విసురుగా తన హ్యాండ్‌బ్యాగ్‌ని గిరాటేసింది.

''ఏంటోయ్ మధూ... ఎవరి మీద వార్ ప్రకటించావ్'' అని ప్రశ్నించాడు ఆమె భర్త మూర్తి. ''ఆ... ఊర్మిళ లేదూ? నా స్నేహితురాలు... ఆవిడగార్ని కట్టుకుంది ఇంకెవరో కాదు. అభ్యుదయ రచయిత ఉదయ్‌కుమార్.''

''ఇంకేం? మంచిదే కదా... మంచివాడు. పేర్లు కూడా బాగా కలిసాయ్. ఊర్మిళా.. ఉదయ్.. ఇంచుమించు మన పేర్లలానే.'' అన్న మూర్తి మాటలు విని ''అదికాదండి. కాలేజీలో చదువుతున్న రోజుల్లో వరకట్నానికి వ్యతిరేకంగా ఎన్నో ఉపన్యాసాలు దంచేవాడు. వ్యాసాలు వ్రాసేవాడు. తీరా తన పెళ్ళి విషయం వచ్చాక అందిరిలానే కట్నం తీసుకున్నాడంట'' అంటూ ఉరిమింది.

''నీకెవరు చెప్పారు?''

''గంట క్రితం సిటీబస్‌కోసం వెయిట్ చేస్తుంటే ఇద్దరూ కన్పించి మాట్లాడారు. ఈ మధ్యనే వాళ్ళకీవూరు బదిలీ అయ్యిందంట. రేపు మనిద్దర్ని వాళ్ళింటికి భోజనానికి ఆహ్వానించారు.''

''సరే.. వెళ్దాం. నాకు కూడా ఆయన్ని చూడాలనివుంది.''

''ఆయన ముఖం ఎలా చూడగలరండి?''

''కళ్ళతో...'' అన్న మూర్తి సమాధానానికి కోపంగా ''గొప్ప జోకేసారులెండి'' అంటూ లోపలికెళ్తున్న మధురిమను చూసి చిన్నగా నవ్వుకున్నాడు మూర్తి.

• • •

డ్రాయింగ్ రూమ్‌లో కూర్చున్న మూర్తికి ఎదురుగా కూర్చుంది ఆమె. కాస్త ఫ్రెష్ అప్ అయిన మధురిమలో ప్రశాంత వదనాన్ని గమనించిన మూర్తి, ''మధూ... ఇందాక ఉదయ్ గురించి ఏదో చెప్పావ్. చూడు మధురిమా పూర్తి విషయాలు తెలుసుకోకుండా ఏదైనా ఒక విషయం గురించి ఒక నిర్ధారణకు రాకూడదు. ఆయన గురించి నేను కూడా మంచివాడనే విన్నాను. కాకపోతే నీవు చెప్పినదాన్నిబట్టి ఇంకా పూర్తిగా అతను ఎటువంటివాడు అని తేల్చుకోలేదు. పూర్తిగా తెలుసుకున్న తర్వాతనే ఏ విషయం గురించి అయినా మనం ఒక నిర్ధారణకు రావాలి'' అన్నాడు మూర్తి.

• • •

మర్నాడు ఉదయం పదిగంటలకు ఉదయ్ ఇంటికి చేరారు మధురిమ, మూర్తి. సాదరంగా ఆహ్వానించింది ఊర్మిళ. ఫ్రెండ్‌ని తన భర్తకి పరిచయం చేసింది మధురిమ. ''ఆ... అన్నట్లు రచయితగారు కనపడరేం?'' అంటూ వ్యంగ్యంగా అంది.

''బజార్‌కి వెళ్లారు. మీరు కూర్చొని మాట్లాడుతుండండి'' అని చెప్పి పది నిముషాల్లో కాఫీలతో ప్రత్యక్షమయింది ఊర్మిళ. ముగ్గురూ కాఫీలు త్రాగుతుండగా మాటల్లోకి దించి కట్నకానుకల విషయం అడిగింది మధురిమ. మూర్తిమాత్రం దినపత్రికలో వారఫలాలు చూస్తూనే వీరి సంభాషణ కూడా వింటున్నాడు.

''ఉదయ్‌కి నాకు పెళ్ళికి ముందే పరిచయం ఉంది. కొన్ని సంవత్సరాలకి పెళ్ళి గురించి అనుకున్నాం. అతను మా ఇంట్లో పెద్దలకి చెప్పి ఒప్పిస్తానన్నాడు. కాకపోతే కట్నం తీసుకోని వారిపై మా తల్లితండ్రులకు కొంత అపనమ్మకం ఉందని, ఏదో



లోపం ఉంది కాబట్టే అబ్బాయి కట్నం తీసుకోవడంలేదేమో అని పెదవి విరిచే సమాజంలో మా తల్లిదండ్రులు కూడా సభ్యులే అని గుర్తుచేసాను. దానికి ఉదయ్ అంగీకరించలేదు. కొంతకాలం మాకలయికల మధ్య జాప్యం జరిగింది. ఈలోగా నాన్న వేరే సంబంధాలు చూస్తున్నాడని చెప్పాను. మా ఇంటికి సాంప్రదాయరీత్యా పెళ్ళిచూపులకు వచ్చి అమ్మాయి నచ్చిందని చెప్పి, కట్నం మాత్రం నామమాత్రంగానే పుచ్చుకున్నాడు. అలా తాను కట్నం తీసుకున్నాడన్న చెడ్డపేరు వచ్చినప్పటికీ నా కోసం అలా చేయాల్సి వచ్చింది. అసలు ఉదయ్ వాళ్ళు ఆర్థికంగా ఉన్నవాళ్లు. పెళ్ళి మాత్రం సింపుల్‌గానే చేయించాడు. పెళ్ళి తర్వాత మేం ఇచ్చిన కట్నం నాపేరునే ఫిక్సడ్ చేయించాడు. ఆ తర్వాత ఈ విషయం తెల్సిన మా తల్లిదండ్రులకి అటువంటివాడు అల్లుడిగా దొరికినందుకు సంతోషించారు'' అంటూ ముగించింది ఊర్మిళ.

పేపర్ చదువుతున్న మూర్తి, మధురిమవైపు చూశాడు. సిగ్గుతో తలదించుకుంది ఆమె.

★